క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



గన్నవరంరూరల్: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని గన్నవరం సబ్ డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని ముస్తాబాదలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క పాడి రైతు నాలుగు నెలలు పైబడిన పశువులకు టీకాలు వేయించాలని చెప్పారు. ఆ టీకాల వల్ల వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెటర్నరీ డాక్టర్ మేడీ వైడూర్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాత డి.అమూల్య విరాళంతో 300 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోపం తలెత్తకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం కెనాల్ రోడ్, వినాయకుని గుడి, వన్ టౌన్ ప్రాంతాల్లో జరుగుతున్న దసరా నవరాత్రుల వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చే అమ్మవారి భక్తులకు కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి లోపం ఉండకూడదన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏఏ పాయింట్ల వద్ద కల్పిస్తున్నారు, క్యూలైన్ల వద్ద సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, ఉచిత చెప్పుల స్టాండ్, మరుగుదొడ్ల పాయింట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కెనాల్ రోడ్ల వద్ద పాడైపోయిన ఫెన్సింగ్ గమనించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు

ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయం

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల క్షేమమే ప్రథమ ధ్యేయమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన చీఫ్ ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, ఎస్టేట్ ఆఫీసర్ / ఇంచార్జ్ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)లతో సమావేశమయ్యారు. ప్రజలకు ఎటువంటి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున, నగర పరిధిలోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రమాదం కలగకుండా అవగాహన కల్పించాలని, కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్లు ఎన్నున్నాయో సంపూర్ణ సర్వే జరిపించాలని చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్‌ను ఆదేశించారు. కొండ సామర్థత తెలిపే జియాలజిస్టు టెస్టులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి ని ఆదేశించారు. ప్రమాదానికి గురయ్యే ఇళ్లలో నివసిస్తున్న వారిని పునరావాసకేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ ఆఫీసర్, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇన్చార్జ్ శ్రీధర్‌లను ఆదేశించారు.

డెర్మటాలజీ పీజీ ప్రజెంటేషన్‌కు బహుమతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలల డెర్మటాలజీ విభాగంలో పీజీ చేస్తున్న డాక్టర్ జి.వర్ధినిరితిక నోటి వ్యాధుల నిర్ధారణలో ఉపయోగించే మ్యూకోస్కోపీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి మొదటి బహుమతి లభించింది. ఈ నెల 14న విశాఖపట్నంలో జరిగిన 14వ రాష్ట్ర స్థాయి చర్మ వ్యాధుల వైద్యుల సదస్సులో డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వాణితో పాటు ఆరుగురు పీజీ విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు సమర్పించారు. వారిలో జి.వర్ధినిరితిక సమర్పించిన పత్రానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు తన చాంబర్‌లో వర్ధినిరితికను ప్రత్యేకంగా అభినందించారు. ఇది సిద్ధార్థ వైద్య కళాశాలకే గర్వకారణమని ఆయన అన్నారు.

బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు

- రామవరప్పాడు మండల పరిధిలో లేని బస్ షెల్టర్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని వినతి



రామవరప్పాడు రింగ్‌లో ఫుట్‌బోర్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

రామవరప్పాడు: నగరానికి ఆనుకుని ఉన్న రామవరప్పాడు రింగ్‌తో పాటు పలు గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఏళ్ల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే పలు గ్రామాల్లో కనీసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయని పరిస్థితి. దీంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువై కొన్నేళ్లుగా ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై సిటీ బస్సులతో పాటు నిత్యం గన్నవరం, హనుమాన్ జంక్షన్, ఏలూరు వైపు వెళ్లు బస్సులు ఆగుతుంటాయి. ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ బస్సుల్లోనే పలు గ్రామాల మీదుగా తమ గమ్యస్థానాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులతో పాటు సిటీ బస్సులు ఈ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఆగుతాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ కూలీలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి పెద్ద సంఖ్యలో బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో ఫుట్ బోర్డుల పైనే నిలబడాల్సి వస్తుంది. ఒక్కో రోజు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదమని తెలిసిన తప్పక రహదారిపై వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలువ నీడ కరువు

ఆయా గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ప్రయాణికులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు పడే అవస్థలు వర్ణనాతీతం. బస్సుల కోసం ఎండలో అధిక సమయం నిలబడి కళ్లు తిరిగి పడిపోతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. అదే వర్షకాలంలో వర్షం పడినప్పుడల్లా సమీప షాపులు, దుకాణాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో వందల సంఖ్యలో రాకపోకలు సాగించే వాహనాలతో జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి చూస్తూ భయాందోళనలకు గురవుతున్నామని ప్రయాణికులు తెలిపారు.

ఫుట్‌పాత్‌లపై పడిగాపులు..

రామవరప్పాడు రింగ్‌లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌లపై బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. అదే వర్షాకాలం, వేసవిలో పడరాని పాట్లు పడుతున్నాం. కనీసం నిల్చోవడానికి కూడా నీడ కరువు అవుతోంది. దాదాపు అన్నీ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వంతెన సెంటర్, ఎనికేపాడు ప్రధాన సెంటర్‌లలో రష్ అవర్స్‌లో విద్యార్థులు, ఉద్యోగులు నిలబడేందుకు జాగా లేక జాతీయరహదారిపైనే నిల్చుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– పి.రమేష్, ప్రయాణికుడు

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

నగరానికి అతి సమీపంలో ఉన్న పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు బస్ షెల్టర్లు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, కళాశాలలు ఉన్న స్టాప్‌ల వద్ద కూడా బస్ షెల్టర్లు కరువయ్యాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సొంత వాహనదారుల నుంచి వాహనమిత్ర దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్‌కే నజీర్ తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ.. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ కార్యదర్శులకు దరఖాస్తుదారులు దరఖాస్తులు సమర్పించాలన్నారు. సొంతగా ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. దరఖాస్తు దారుడు ఆధార్‌కార్డు, తెల్ల రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఏపీలో రిజిస్ట్రేషన్ జరిగిన వాహన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేయాలని సూచించారు. ఒక వాహనం ఉన్న కుటుంబానికే పథకం అమలు జరుగుతుందని కమిషనర్ నజీర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ ఈ.రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఏరియా, సొసైటీపేట, గాంధీబొమ్మ సెంటర్, గొడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, వీనస్ బజార్, శాంతి థియేటర్, పాత టీడీపీ ఆఫీస్ తదితర ప్రాంతల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పునాదిపాడులో రణభేరి కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు

కంకిపాడు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికై చేపట్టిన రణభేరి కార్యక్రమం మంగళవారం పునాదిపాడుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు, 12 పీఆర్సీ ఎరియర్స్ చెల్లించలేదన్నారు. డీఏల ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ పేరుతో చేసిన మార్పుల వల్ల రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యారన్నారు. బోధనేతన కార్యక్రమాలతో ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. సంఘ కార్యదర్శులు ఎస్పీ మనోహర్‌కుమార్, కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, కోశాధికారి ఎం.వరప్రసాద్, మండల ప్రతినిధులు ఎన్.బుచ్చయ్యబాబు, ఎం.శ్రీనివాసరావు, ఏ.పుష్పలత, కేబీకే గోపాల్, పి.శ్రీరామ్, సీఐటీయూ నాయకులు టీ.నరేష్, పి.రంగారావు, సీహెచ్ శ్రీహరి, జి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయలో 11వ తరగతికి స్పాట్ అడ్మిషన్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతి ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.యదునందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ సైన్స్ గ్రూపుల్లో మిగిలిన సీట్లు కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టామన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. 'మొదట వచ్చిన వారికి – మొదటి ప్రాధాన్యత' పద్ధతిలో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రెండేళ్ల పాటు ఉచిత విద్య, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్క్ మెమోరండం, బదిలీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలతో పాఠశాల పని గంటల్లో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. దరఖాసుకు ఈ నెల 23తో గడువు ముగియనున్నట్లు చెప్పారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సోషల్ యాక్టివిస్ట్ తులసి అన్నారు. కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం హైస్కూల్‌లో 7, 8 తరగతులు చదివే విద్యార్థినులకు నిర్భయ క్రాంతి మహిళ మండలి ఆధ్వర్యంలో మంగళవారం చైల్డ్ అబ్యూస్ అండ్ పోక్సో యాక్ట్, డ్రగ్స్ వినియోగం వలన వచ్చే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడ్వకేట్ ఉషారాణి మాట్లాడుతూ చిన్నారులపై అత్యాచారాలకు పోక్సో యాక్ట్ ద్వారా కఠినమైన శిక్షలు ఉంటాయని, పోక్సో యాక్ట్ గురించి విపులంగా వివరించారు. ఎస్ఐ శివకుమారి మాట్లాడుతూ ఏ అఘాయిత్యం జరిగినా ముందుగా తల్లిదండ్రులకు, తర్వాత టీచర్లకు తెలియజేసి 1089, 112కు భయపడకుండా ఫోన్ చేసి సత్వర న్యాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో నిర్భయ క్రాంతి మహిళా మండలి ప్రెసిడెంట్ రత్నలక్ష్మి, మహిళామిత్ర సభ్యురాలు ఇందిర, సీహెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై సీఆర్పీలకు శిక్షణ



పెదపులిపాకలో శిక్షణకు హాజరైన సీఆర్‌పీలు

పెనమలూరు: తడి, పొడి చెత్తపై పెదపులిపాక గ్రామంలో మూడు మండలాలకు చెందిన సీఆర్పీలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు లోకల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పెనమలూరు, గన్నవరం, తోట్లవల్లూరు మండలాలకు చెందిన సీఆర్పీలకు కొద్ది రోజులుగా తడి, పొడి చెత్తపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా పెదపులిపాక గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాసాచౌదరి మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో తడి, పొడి చెత్త వర్గీకరణపై కుటుంబాలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వాతావరణ పరిస్థితులు కారణంగా అనారోగ్యానికి గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి, వారిని చైతన్య పర్చాలని కోరారు. కార్యక్రమంలో పెదపులిపాక, చినపులిపాక, జక్కుల నెక్కలం గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఓగిరాల తిరుమల వెంకటరత్నం, ఎం.సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, శిక్షణలో 44 మంది సీఆర్పీలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సమర్థంగా జరగాలి

కంకిపాడు: తడి, పొడి చెత్త సేకరణ సమర్థంగా జరగాలని మాస్టర్ ట్రైనర్లు పునాదిపాడు పంచాయతీ కార్యదర్శి డి.బాపూజీ, కుందేరు పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు సూచించారు. పునాదిపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కంకిపాడు, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన రిసోర్సు పర్సన్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు బాపూజీ, కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ సునీత, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గట్కా పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కుసుమ్

పెద్దఅవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలోని సెయింట్ ఆంథోనిస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి గట్కా పోటీల్లో పలు పతకాలను సాధించారని ప్రిన్సిపాల్ కుసుమ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని లయోల కళాశాలలో జరిగిన నాల్గవ రాష్ట్ర స్థాయి గట్కా చాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 59 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది గోల్డ్ మెడల్స్, 20 మంది సిల్వర్ మెడల్స్, మరో 16 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. అండర్–8, 17 విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, అండర్–12, 14 విభాగాల్లో రెండో స్థానంలో నిలిచారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన పి.శ్రీనివాసరావును ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



ఉప్పలూరులో వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కంకిపాడు: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి సూచించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను అధికారుల బృందం, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించింది. జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ.. ఎరువుల యాజమాన్యంలో జాగ్రత్తలు అవసరమన్నారు. ఎకరాకు బస్తా యూరియా వాడకం తగ్గిస్తే ఆ బస్తాకు సంబంధించిన రూ.800 నగదు నేరుగా రైతు ఖాతాకు జమ చేస్తామని చెప్పారు. ఈ–పంట నమోదు త్వరితగతిన పూర్తి కావాలని, రైతులు అవగాహనతో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. వరి పంటలో పొడ తెగులు గుర్తించామని, తెగులు నివారణకు హెక్సకొనజోల్, లేదా వాలిడా మైసన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పామర్రు ఏడీఏ స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వీరవల్లి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నమెంట్‌కు బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.నిర్మల మంగళవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రగ్బీ జిల్లా జట్టు సెలక్షన్స్‌లో నలుగురు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. అండర్–14 బాలుర జట్టుకు లాము పృథ్వీరాజు, తిరుమలరెడ్డి హేమసాయి, అండర్–17 బాలుర జట్టుకు యాళ్ల గణేష్, అండర్–17 బాలికల జట్టుకు కె.శ్రావణి ఎంపికయ్యారన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం నిర్మల తెలిపారు. విద్యార్థులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కోలా వెంకట రామారావును హెచ్ఎం అభినందించారు.

జిల్లా రగ్బీ జట్లకు ఉంగుటూరు విద్యార్థుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం అనిత

గన్నవరం: మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రగ్బీ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్ఎం సీహెచ్.అనిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారన్నారు. అండర్–17 బాలుర విభాగంలో గణేష్, బాలికల విభాగంలో సీహెచ్.విన్నీ, భవ్యశ్రీ, అండర్–14 బాలుర విభాగంలో డి.చేతన్‌సింహ, డి.తనుష్‌కుమార్, బాలికల విభాగంలో టి.ప్రవల్లిక, బి.రిషితను ఎంపికయ్యారని చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు క్రాంతిని హెచ్ఎంతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

కృష్ణలంక(విజయవాడతూర్పు): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కృష్ణలంకలోని సత్యం గారి హోటల్ సెంటర్‌లో డాక్టర్ ఎన్ఆర్ఎస్ గవర్నమెంట్ ఆయుర్వేద కళాశాల, డాక్టర్ ఏఎల్ గవర్నమెంట్ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు, పీజీ స్కాలర్లు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందజేశారు. సుమారు 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



కానూరు సిద్ధార్థలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరులోని కాలేజీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపకులపతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పర్యావరణం పరిరక్షించకపోతే భవిష్యత్తులో మానవాళి పెద్ద ప్రమాదం ఎదుర్కొంటుందన్నారు. ఓజోన్ పొర పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. నేడు పర్యావరణం పట్ల ప్రజలు బాధ్యతతో వ్యవహరించకపోవటంతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇకనైనా ప్రతి పౌరుడు మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షించాలని, ఈ విషయంలో విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డీన్ డాక్టర్ డి.వెంకటరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జె.శివరామ్‌ప్రసాద్, పి.సుష్మాచౌదరి పాల్గొన్నారు.

గూగుల్ అంబాసిడర్లుగా వికాస్ విద్యార్థులు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులను గూగుల్ కంపెనీ తమ అంబాసిడర్లుగా ఎంపిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గూగుల్ కంపెనీ మంగళవారం నిర్వహించిన క్రియేటివిటీ రౌండ్‌లో 150 మంది విద్యార్థులు పాల్గొనగా 100 మంది మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ పరీక్ష ద్వారా నలుగురు విద్యార్థులను గూగుల్ కంపెనీ ఎంపిక చేసి, ఒప్పంద పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఎంపికైన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సీహెచ్.బాల అనూష, ఎం.జోజశ్రీ, భువన శ్రీ, ఎం.తేజస్వీ, గూగుల్ కంపెనీకి జెమిని ఏఐ ప్రోగ్రామ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ టూల్స్ నేర్చుకోగలరని, తద్వారా ప్రావీణ్యం సంపాదించగలరని ప్రిన్సిపాల్ అన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఎస్.కీర్తి, అధ్యాపకులు అభినందించారు.